ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
బుధవారం 4 జూన్ 2025



చికెన్ ధరలు	
లైవ్	140
డ్రెస్	210
స్కిన్‌లెస్	240
గుడ్డు డజన్	66

ఉష్ణోగ్రత	
గరిష్ఠం	38.5
కనిష్ఠం	24.6

ఇసుక రీచ్.. స్థానికులకు తూచ్

నాగారం మండలంలోని రీచ్ సూర్యాపేట ట్రాక్టర్ల యజమానులకు కేటాయింపు

8

ఎటూ పాలుపోవడంలేదు

- ఇబ్బంది పడుతున్న పాడి రైతులు
- వ్యవసాయ, కుటుంబ అవసరాలకూ ఇబ్బందులే



మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామానికి చెందిన పైళ్ల కవిత స్థానిక సొసైటీలో సభ్యురాలు. గతంలో ఆమె ఆ సొసైటీలో సుమారు 20 లీటర్లపైన పాలు పోసేవారు. ఎండాకాలం కావడంతో పశువులు పాలు అంతగా ఇవ్వడంలేదు. ఇప్పుడు రోజు 6 లీటర్ల గేదె పాలు, ఐదు లీటర్లు ఆవు పాలు పోస్తున్నారు. వెన్న శాతాన్ని అనుసరించి గేదె పాలు లీటరు రూ.65, ఆవు పాలు లీటరు రూ.36 తీసుకుంటున్నారు. రోజుకు సుమారు రూ.570 చొప్పున మూడు నెలలకు రూ.51,300 వేల బిల్లు రావాల్సి ఉంది. 15 రోజులకు ఒకసారి బిల్లు ఇవ్వకపోవడంతో కుటుంబ ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నారు. పశువులకు దాణా కొనడానికి, ఇతర ఖర్చులకు అప్పు చేయాల్సి వస్తుంది. నాలుగేళ్లుగా బోనస్ రావడంలేదు. రూ.2లక్షలపైగా బోనస్ రావాల్సి ఉంది. మదర్ డెయిరీ బకాయి బిల్లులు చెల్లించాలని ఆమె కోరుతున్నారు.

6

- (ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

వానొస్తే వరదే(నా)?

- అప్రమత్తంగా లేకుంటే పట్టణాలు మునకే
- గతంలో ఇళ్లలోకి, వీధుల్లోకి వరద నీరు
- అమల్లోకి యాక్షన్‌ప్లాన్



సూర్యాపేటలో మురుగుకాల్వకు గండికొడుతున్న మునిసిపల్ సిబ్బంది(ఫైల్)

జిల్లాలోని మునిసిపాలిటీల్లో చిన్నపాటి వర్షం కూడా వరద ఇబ్బందులను తెప్పిస్తోంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక చిన్నపాటి వర్షానికి వరద నీరు ఇళ్లలోకి, వీధుల్లోకి చేరుతోంది. ముంపు ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రతీ ఏడాది అధికారులు విఫలమవుతున్నారు. గతేడాది సూర్యాపేట, తిరుమలగిరి, హుజూర్‌నగర్, కోదాడ పట్టణాల్లో చాలా ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. అయినప్పటికీ అధికారులు తాత్కాలిక పనులతో చేతులు దులుపుకున్నారు. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభం కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి- సూర్యాపేట టౌన్)

వర్షాకాలంలో వరద ముప్పుపై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అధికారులు జిల్లా కేంద్రమైన సూర్యాపేటలో చేపట్టడం లేదు. కొన్నేళ్లుగా వర్షాకాలంలో పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. మానసనగర్, తాళ్లగడ్డ, ప్రియాంకకాలనీ, శ్రీనివాస కాలనీ, పుల్లారెడ్డి చెరువు ప్రాంతం, స్నేహనగర్, కుడకుడ ప్రాంతం, ఎస్వీ ఇంజనీరింగ్ ప్రాంతం, వెంకటేశ్వరకాలనీ, విద్యానగర్ ప్రాంతాలు పూర్తిగా జలమయం అవుతున్నాయి. ముఖ్యంగా సద్దులచెరువు ఏమాత్రం అలుగు పోసినా పక్కనే ఉన్న తాళ్లగడ్డ, వెంకటేశ్వరకాలనీ, ప్రియాంకకాలనీలు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయి. ఇళ్లల్లోకి నీరు చేరుతోంది. రెండేళ్ల కిందట సద్దుల చెరువు అలుగుపోయడంతో వెంకటేశ్వరకాలనీ పూర్తిగా మునిగింది. దీంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టిన రెండు రోజులకు గాని అదుపులోకి రాలేదు. అంబేడ్కర్‌నగర్, చింతలచెరువుప్రాంతాల్లో సైతం గతంలో వరద నీరు ఇళ్లల్లోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వరుసగా మూడు రోజులు ముసురు ఉందంటే ఇక ఇళ్లలో నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదు.

శిథిల భవనాలతో పొంచి ఉన్న ప్రమాదం

సూర్యాపేట పరిధిలో అనేక భవనాలు శిథిలావస్థకు చేరాయి. అయినప్పటికీ కొన్ని భవనాల్లో ప్రజలు నివాసముంటున్నారు. ఇదిలా ఉండగా శిథిలావస్థకు చేరిన భవయ యజమానులకు మునిసిపల్ అధికారులు నోటీసులు జారీచేశారు. వాటిని కూల్చివేయాలని ఆదేశించారు. అయితే అది ఎక్కడా పూర్తిస్థాయిలో ఆచరణలోకి రాలేదు. మొత్తం 41 నోటీసులు ఇవ్వగా అందులో అంబేడ్కర్ ప్రాంతం నుంచి శంకర్‌విలాస్ సెంటర్, వాణిజ్యభవన్ సెంటర్...

- మిగతా 8వ పేజీలో...

100 రోజుల యాక్షన్‌ప్లాన్

ఈ నెల 2వ తేదీ నుంచి సెప్టెంబరు 9వ తేదీ వరకు మునిసిపాలిటీల్లో 100 రోజుల యాక్షన్‌ప్లాన్ అమల్లో ఉంటుంది. దీనిలో పారిశుధ్య నిర్వహణ, పాతభవనాల తొలగింపు, హరితహారం, ఇంకుడుగుంతల నిర్మాణం, టౌన్‌ప్లాన్ పనులు, వ్యాధు నివారణపై అవగాహన సదస్సు, లైసెన్స్‌లపై అవగాహన, చెత్తసేకరణ వంటి 50 రకాల పనులు చేపట్టనున్నారు. అంతేకాకుండా ఈ కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములు చేయనున్నారు.

వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలి



వర్షపు నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. సీజనల్ వ్యాధులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై అధికారులు సమన్వయంతో పనిచేయాలి. ప్రధాన కూడళ్ళు, ఆవాసప్రాంతాల్లో, మురుగుకాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలి. భారీ వర్షం కురవకముందే డీషీల్ట్ పనులు పూర్తి చేయాలి. 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను సమగ్రంగా అమలు చేయాలి.

- తేజస్‌నందలాల్ పవార్, కలెక్టర్

విద్యుత్ అధికారుల ఫోన్‌నెంబర్లు మార్పు

భానుపురి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని విద్యుత్ అధికారుల సెల్ ఫోన్ నెంబర్లు ఇటీవల మారాయి. ఆయా అధికారుల నెంబర్లు ఇంతకాలం బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌తో పనిచేయగా తాజాగా ఎయిర్‌టెల్‌కు మార్చారని విద్యుత్ అధికారులు తెలిపారు. మారిన నెంబర్లు ఇలా ఉన్నాయి.

అధికారి హోదా	ఫోన్‌నెంబర్
ఎస్ఈ	8712472747
జిల్లా కంట్రోల్ రూం	8712472773
డీఈ	8712472921
సూర్యాపేట కంట్రోల్‌రూం-1	8712473066
కంట్రోల్ రూం-2	8712473067
ఏడీఈ	8712472906
సూర్యాపేటరూరల్	8712473076
తుంగతుర్తి	8712472907
నాగారం	8712472908
మండలం(ఏఈ)	**నెంబరు**
సూర్యాపేట టౌన్-1	8712472914
సూర్యాపేట టౌన్-2	8712472915
సూర్యాపేట రూరల్	8712472913
ఆత్మకూర్(ఎస్)	8712472912
పెన్‌పహాడ్	8712472911
చివ్వెంల	8712472918
తుంగతుర్తి	8712472916
నూతనకల్	8712472910
మద్దిరాల	8712472771
జాజిరెడ్డిగూడెం	8712472909
తిరుమలగిరి	8712472917
నాగారం	8712473068

ప్రభుత్వ బడులను ప్రజలే కాపాడాలి

తిరుమలగిరి రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడులను ప్రజలే కాపాడాలని, విద్యార్థులందరినీ ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని డీఈవో అశోక్ అన్నారు. మండలంలోని తాటిపాముల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఇటీవల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గ్రామంలో పర్యటించిన క్రమంలో పాఠశాలలో భవన నిర్మాణాలకు నిధులు కేటాయించారు. ఈ నేపథ్యంలో పాఠశాల భవన నిర్మాణాలకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ ఏఈ రంగారావు, ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు శ్రీధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సత్తయ్యలు పాల్గొన్నారు.

సైడ్‌వాల్స్‌తో బ్రిడ్జి నిర్మాణం



ఎన్నెస్పీ కాల్వను పరిశీలిస్తున్న డీఈ బిక్షం

హుజూర్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సైడ్‌వాల్స్ ఏర్పాటుచేసి బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు ఎన్నెస్పీ డీఈ బిక్షం తెలిపారు. మండలంలోని బూరుగడ్డ, మాచవరం గ్రామంలో ఆర్-8 కాల్వపై బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం బూరుగడ్డలో ఆర్-8 మేజర్‌ను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. మంత్రి ఉత్తమ్‌కు ఆదేశాల మేరకు బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు బిక్షం, నాగయ్య, వెంకన్న, శ్రీనివాసు,లింగయ్య, రాము, గోపి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలి

కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా అంకితభావంతో కృషి చేయాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. జిల్లాలోని వైద్య, ఆరోగ్య శాఖాధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎక్కడా కూడా డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్, జ్వరాల వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. పారిశుధ్య పనులు పక్కాగా జరిగేలా నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారి కోటిరత్నం, నాజియా, శ్రీశైలం, వైద్యాధికారులు ఆర్‌బీఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సభలు ఉపయోగించుకోవాలి

తిరుమలగిరి రూరల్ : రెవెన్యూ సదస్సులను ప్రజలు ఉపయోగించుకోవాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం మండలంలోని జలాల్‌పురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటుచేసి దరఖాస్తుదారులకు సహకరించాలన్నారు. అనంతరం ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, రైతులతో మాట్లాడారు. పక్కనే ఉన్న శ్రీమల్లిఖార్జున స్వామి దేవాలయాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చామంతి నరేష్, తహసీల్దార్ హరాప్రసాద్, ఆర్ఐ జాజిరెడ్డి, అసిస్టెంట్ అనిత పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

అర్వపల్లి : వాటర్‌షెడ్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. తిమ్మాపురం గ్రామంలో వాటర్‌షెడ్ పథకం కింద చేపట్టిన పనులను కలెక్టర్ పరిశీలించి, మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. గ్రామంలో నాలుగు ఊటకుంటల నిర్మాణం, ఒక చెక్‌డ్యాం పూర్తయ్యిందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో అప్పారావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎస్.వినయ్‌భార్గవ్, నగేష్ పాల్గొన్నారు.

కాంటాలు పూర్తి చేయాలి

మద్దిరాల : ధాన్యం కాంటాలు పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అన్నారు. మద్దిరాల మండలకేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, మాట్లాడారు. ఆయన వెంట తహసీల్దార్ కంట్లమయ్య, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : గొట్టిపర్తి, వెంపటి గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ సందర్శించారు. రైతులతో మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ అప్పారావు, ఆర్డీవో వేణుమాధవ్, డీఎస్‌వో రాజేశ్వర్‌రావు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

మునగాలరూరల్, జూన్3 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ పీ రాంబాబు అన్నారు. మంగళవారం మండలంలోని కొక్కిరేణి గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసేలా కొత్తగా తీసుకొచ్చిన భూభారతి చట్టం అమలులో భాగంగా ఈ నెల 20వరకు జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు మానవీయ కోణంలో భూ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ,తహసీల్దార్ రామకృష్ణారెడ్డి,అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిలుకూరు : భూభారతిలో దరఖాస్తు చేసుకుంటే రైతుల భూసమస్యలను పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. మండలంలోని కొండాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధృవకుమార్, ఆర్ఐలు మంత్రిప్రగడ సీతారాంచందర్‌రావు, శ్వేత, కార్యదర్శి కార్తికొరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బక్రీద్ పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

సూర్యాపేట క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్ పండుగను సోదర భావంతో కులమతాలకు అతీతంగా జరుపుకోవాలని డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కిరాణ, ఫ్యాన్సీ మర్చంట్ హాల్‌లో నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు కుల, మతాలకతీతంగా పండుగను జరుపుకోవాలన్నారు. ఈ నెల 7వ తేదీన బక్రీద్ పండగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా వేదికగా కులమతాల మధ్య విబేదాలు సృష్టించే వీడియోలు, ఫొటోస్ పెడితే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవ్, సీఐ రాజశేఖర్, మునిసిపల్ కమిషనర్ బీ శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణయ్య, వెహికిల్ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్‌రెడ్డి, ఎస్ఐలు ఏడుకొండలు, సైదులు, ఆంజనేయులు, ప్రవీణ్, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, హిందు, ముస్లిం, మత పెద్దలు పాల్గొన్నారు.

ఒత్తిడిని తగ్గించేందుకు యోగా శిక్షణ...

యోగా సాధనతో ఒత్తిడి దూరమవుతుందని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. శాంతి భద్రతల రక్షణ, ముఖ్యమైన బందోబస్తులు, పండుగల విధులు, ప్రజల రక్షణ, వంటి విధుల్లో ఒత్తిడి గురవుతున్న పోలీసులకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో యోగా శిక్షణ తరగతులను ప్రారంభించి, మాట్లాడారు. యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నర్సింహాచారి, యోగా శిక్షకులు పాపిరెడ్డి, గురూజీ, ఆర్ఎస్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

మన ఊరి బడిని కాపాడుకుందాం



కోదాడ డివిజన్ నుంచి ప్రారంభమైన యూటీఎఫ్ విద్యార్థుల నమోదు ప్రచారజాత

కోదాడ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి మన ఊరి బడిని కాపాడుకుందాం అని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమయ్య అన్నారు. మంగళవారం కోదాడ యూటీఎఫ్ డివిజన్ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యార్థుల నమోదు ప్రచారజాత వాహనాన్ని బస్టాండ్ సెంటర్‌లో ప్రారంభించి, మాట్లాడారు. ప్రభుత్వ బడి మూతపడితే సమాజానికి నష్టమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యను పొందడంతో పాటు ఫీజుల భారం నుంచి ఉపశమనం పొందాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఊరి బడిలోనే చేర్పించి బడికి అవసరమైన వసతుల కల్పనకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే తప్పనిసరిగా బడి నిలబడుతుందన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పీ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రచారజాత బుధవారం కోదాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అన్ని గ్రామాల్లో కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పాండురంగచారి, జ్యోతి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు టీపీ జనార్ధన్, గెజిటెడ్ హెచ్‌ఎంలు శ్రీదేవి, పిచ్చయ్య, యూటీఎఫ్ నాయకులు మైసయ్య, శ్రీనివాసరావు, మండవ ఉపేందర్, సైదిరెడ్డి, నక్క శ్రీను, అంజి, పిడతల శ్రీనివాసరావు, ఎండీ హమీద్, కిషోర్ బాబు, మాతంగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యూట్యూబ్‌లో చూసి.. నకిలీ పత్తి విత్తనాల తయారీ



విలేకరుల సమావేశంలో నకిలీ పత్తి వితనాల కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నర్సింహ

వివరాలు వెల్లడించిన ఎస్పీ నర్సింహ

సూర్యాపేటక్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యూట్యూబ్‌లో చూసి నకిలీ పత్తి విత్తనాలు తయారుచేసిన ఓ కౌలు రైతును, వాటిని విక్రయించేందుకు సహకరించిన మరో ఇద్దరిని సూర్యాపేట జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ నర్సింహ వివరాలు వెల్లడించారు. తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన సింగారపు యాదగిరిస్వామి కొంత భూమిని కౌలుకు తీసుకొని పత్తి సాగు చేస్తున్నాడు. పత్తి విత్తనాలు తయారుచేసే విధానాన్ని యూట్యూబ్‌లో చూసి 308కిలోల నకిలీ పత్తి విత్తనాలు తయారుచేశాడు. ఎక్కువ దిగుబడి రాకపోవటంతో పండించిన పత్తి నుంచి గింజలు వేరుచేసి, వాటిని పత్తి విత్తనాలుగా తయారుచేయవచ్చని యూట్యూబ్‌లో చూశాడు. ఇందుకోసం ఓ మోటార్, ప్లాస్టిక్ డ్రమ్, 15 సల్ఫ్యూరిక్ యాసిడ్ క్యాన్లు, పత్తి గింజల రంగు వచ్చేందుకు ఫైన్‌స్టార్ డబ్బాలను తీసుకువచ్చి కౌలుకు తీసుకున్న పొలంలో 308కిలోలకు పైగా నకిలీ పత్తి విత్తనాలు తయారుచేశాడు. వాటిని బీటీ-3 విత్తనాలుగా రైతులను నమ్మించి విక్రయించేందుకు తనకు పరిచయం ఉన్న తిరుమలగిరి మండలం నందాపురం గ్రామానికి చెందిన లోడంగి నవీన్, అడ్డగూడూరు మండలం చిర్రగూడూరు గ్రామానికి చెందిన చిత్తలూరు సోమనారాయణ సహకారం తీసుకున్నాడు. తాను విత్తనాలను తయారుచేశానని, ఎక్కువ దిగుబడి వస్తాయని, గడ్డి మందు కంపెనీ కంటే తక్కువ ధరకు ఇస్తామని ప్యాకెట్‌కు రూ.1500లకు విక్రయించాడు. ఇద్దరూ 10 కిలోల చొప్పన తీసుకుని సమీప గ్రామాల్లో ఎక్కువ ధరకు విక్రయించారు. మళ్లీ విత్తనాలు కావాలని యాదగిరిస్వామిని కోరారు. ఆయన లోడంగి నవీన్‌కు 50 కిలోలు, చిత్తలూరి సోమనారాయణకు 40కిలోల చొప్పన విత్తనాలు విక్రయించాడు. ఈ విషయం బయటపడడంతో పక్కా సమాచారం తెలుసుకున్న తిరుమలగిరి పోలీసులు నిందితుల వ్యవసాయ భూముల వద్ద, ఇళ్లలో దాడులు నిర్వహించారు. నిందితుల నుంచి రూ.4.62లక్షల విలువైన 308కిలో నకిలీ పత్తి విత్తనాలను, తయారీకి ఉపయోగించిన ప్రాసెసింగ్ మోటార్, ప్లాస్టిక్ డ్రమ్, 15 యాసిడ్ క్యాన్లు, మూడు ఫైన్‌స్టార్ డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్ఐ హరీష్‌కుమార్, ఏఎస్ఐ వెంకన్నను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రవిందర్‌రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ నర్సింహ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయిస్తే సహించేది లేదని, వారిపై పీడీ యాక్ట్ అమలుచేస్తామన్నారు. నకిలీ విత్తనాల సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలన్నారు.

భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శం

- ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్ మురళీధర్‌రెడ్డి



భువనగిరిటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): భారతీయ కుటుంబ వ్యవస్థ ప్రపంచానికే ఆదర్శమని ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్ పీ.మురళీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో ఆర్ఎస్ఎస్ ప్రాథమిక శిక్షా వర్గ సమారోప్‌లో ఆయన మాట్లాడారు. కుటుంబ సభ్యులందరూ కలిసిమెలిసి ప్రేమతో ఉండాలని, ప్రపంచంలోని అన్నిదేశాల ప్రజలు కోరుకుంటున్నారన్నారు. రామాయణ, మహాభారతం, వేదాలు తదితర భారతీయ ఇతిహాసాలను, నైతిక విలువలను, ధర్మం, కర్తవ్యం, బాధ్యతలు తదితర అంశాలపై పిల్లలకు బోధించకపోతున్న ఫలితమే నేటి దుష్పరిణామాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నల్లగొండ విభాగ్ సహ సంఘచాలక్, ఇటుకల కృష్ణయ్య, యాదాద్రి జిల్లా సంఘ చాలక్ బాదం ప్రకాశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలి



సమీక్ష నిర్వహిస్తున్న పీడీ అప్పారావు

నూతనకల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రజలు తమ ఇళ్ల నిర్మాణ సమయంలో, ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా గ్రామ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీవో పీడీ అప్పారావు, డీపీవో యాదగిరి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, గ్రామాల్లోని మురికి కాల్వల చివర ఇంకుడుగుంతలు నిర్మించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. అదేవిధంగా వర్షాలు ప్రారంభం కాగానే నర్సరీల్లోని మొక్కలను హరితహారంలో నాటించాలన్నారు. మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యాలను సాధించేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

- యాదాద్రి, సూర్యాపేట జిల్లాలో ఇద్దరు, నల్లగొండ జిల్లాలో ఒక్కరు చొప్పున
- మృతుల్లో కనగల్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్

6

మా భూమి నిర్వాసితులకు కేటాయించొద్దు



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దేవరోనితండా, జాన్‌తండా రైతులు

దేవరకొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా తాము సాగుచేసుకుంటున్న భూమిని పెండ్లిపాకల రిజర్వాయర్ భూ నిర్వాసితులకు ఇవ్వాలనే ఆలోచనను విరమించుకోవాలని దేవరోనితండా, జాన్‌తండా రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈమేరకు నల్లగొండ జిల్లా దేవరకొండ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా జాన్‌తండా మాజీ సర్పంచ్ రమేష్, రైతులు నాగరాజు, నర్సింహనాయక్, కోట్యానాయక్, బాలునాయక్ మాట్లాడుతూ కొండమల్లేపల్లి మండలంలోని జాన్‌తండా శివారు సర్వే నంబర్ 86లో ఉన్న 110ఎకరాల ప్రభుత్వ భూమికి అప్పటి ప్రభుత్వం పట్టా, పాస్‌పుస్తకాలు ఇచ్చినట్లు చెప్పారు. సదరు భూమిలో సాగు చేసుకొని తమ కుటుంబీకులు జీవనం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల రెవెన్యూ, నీటి పారుదలశాఖ అధికారులు సర్వేనెంబర్ 86లో 35ఎకరాలు పెండ్లిపాకల రిజర్వాయర్ భూనిర్వాసితులకు పట్టాలు ఇచ్చేందుకు సర్వే చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన భూములను వదులుకునే ప్రసక్తే లేదని, ఆ ఆలోచనను విరమించుకొని మరో ప్రాంతంలో భూనిర్వాసితులకు భూమి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆర్డీవో రమణారెడ్డి రెవెన్యూ సదస్సులో ఉండటంతో రైతులతో ఫోన్‌లో మాట్లాడి రైతుల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని హామీఇచ్చారు. తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తామని రైతులు ఆందోళన విరమించారు.

గడ్డివాము దగ్ధం

నేరేడుచర్ల, జూన్ 3(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామంలో మంగళవారం గడ్డివాము దగ్ధమైంది. బాధితుడు మాతంగి రాముకు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి పక్కనే గడ్డివాము ఏర్పాటు చేసుకున్నాడు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. దీంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చాడు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలలు ఆర్పారు. దగ్ధమైన గడ్డి విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

విద్యుదాఘాతానికి రెండు మూగజీవాలు బలి

అర్వపల్లి, భూదాన్‌పోచంపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గేదె మృతిచెందింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన బొడ్డు సింహాద్రికి గేదె మంగళవారం ఉదయం మేతకు వెళ్లి విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన పాడిరైతు వంగేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రూ.లక్ష విలువైన పాడిగేదె మంగళవారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. వంగేటి శ్రీనివాస్‌రెడ్డి భార్య హంసమ్మ తన పాడి గేదెలను మేత కోసం తీసుకెళ్తుండగా అదే గ్రామానికి చెందిన బందారపు అంజయ్య పొలంలో ఇటీవల నూతనంగా నిర్మించిన కరెంటు పోల్స్‌కు ఇన్సులేటర్లు ఇవ్వకుండా విద్యుత్ అధికారులు నేరుగా కనెక్షన్ ఇచ్చారు. కరెంట్ ఓవర్‌లోడ్‌తో విద్యుత్ వైరుతెగి కిందపడింది. తీగెకు తగిలి ఓ గేదె మృతిచెందింది.

యువకుడి బలవన్మరణం

సూర్యాపేటక్రైం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లాకేంద్రంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట అఫ్జల్‌రైస్ మిల్ ప్రాంతానికి చెందిన సారగండ్ల సాయికుమార్ అలియాస్ ఆంజనేయులు(29) మూడు సంవత్సరాలుగా పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ఐఫోన్‌టెక్(ఆండ్రాయిడ్ హార్డ్వేర్ సాఫ్ట్‌వేర్) అనే పేరుతో దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇటీవల అతను ప్రేమ వివాహం చేసుకున్నట్లు తెలుస్తోంది. సాయికుమార్ మృతిపై బంధువులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

తుంగతుర్తి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల పరిధిలోని గానుగుబండ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన గీతకార్మికుడు పంజాల సోమయ్య సోమవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కడానికి వెళ్లాడు. తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తుండగా ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి జారిపడడంతో నడుము వెన్నుపూస, చేయి విరగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నాడు.

పోషణ కరువై.. యాచకుడిగా మారి



పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల సంరక్షణలో ఆగమయ్య

భువనగిరి టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా పోచంపల్లి మండలకేంద్రానికి చెందిన కన్నె ఆగమయ్య(72) కుటుంబ సభ్యుల పోషణకు దూరమై భువనగిరి పట్టణంలో యాచిస్తూ జీవనం సాగిస్తున్నాడు. తనకు న్యాయం చేయాలంటూ జనవరి 27వ తేదీన ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నాడు. అయినప్పటికీ ఎలాంటి ఓదార్పు లభించని ఆగమయ్య స్థితిని గమనించిన తెలంగాణ ఆర్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎర్రగుంట వెంకటేశం, ఇతర సభ్యులు మంగళవారం అతడిని భువనగిరి పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం. రమేష్‌కుమార్ జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావుకు సమాచారం ఇచ్చారు. దీంతో జిల్లా సంక్షేమ అధికారి సూచనల మేరకు పోలీసులు ఆగమయ్యను పెద్దకొండూరులోని వయోవృద్ధుల అనాథాశ్రమంలో చేర్చారు.

బెదిరిస్తున్నాడని ప్రాణం తీశారు..



రమేష్(ఫైల్)

చౌటుప్పల్ రూరల్, జూన్3(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట శివారులో గత నెల 28న జరిగిన హత్య చేసిన మిస్టరీని పోలీసులు ఛేదించారు. నిందితులను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ సైదాబాద్‌కు చెందిన మారోజు రమేశ్(33) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. హైదరాబాద్ చంపాపేటకు చెందిన లెంకల భాస్కర్(30) వద్ద రమేశ్ ఆటో అద్దె తీసుకుని నడుపుతున్నాడు. రమేశ్ భార్యకు భాస్కర్‌తో వివాహేతర సంబంధం ఉందని అనుమానంతో భాస్కర్‌తో పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీ పెట్టించాడు. గత నెల 28న రమేశ్ భాస్కర్ ఇంటికి వెళ్లి భాస్కర్ కుటుంబ సభ్యులను బెదిరించాడు. తరుచూ రమేశ్ తనను బెదిరించడంతో భాస్కర్ రమేష్‌పై పగ పెంచుకున్నాడు. హైదరాబాద్ మిదానికి చెందిన రియాజ్‌కు ఫోన్ చేసి బెదిరింపు విషయంపై భాస్కర్ సమాచారం ఇచ్చాడు. రియాజ్ రమేశ్‌కు ఫోన్ చేసి సరూర్‌నగర్‌లోని ఓ బార్‌కు తీసుకెళ్లాడు. రమేశ్, భాస్కర్, రియాజ్‌లు కలిసి మద్యం తాగారు. అదే రాత్రి మద్యం కోసమని బైక్‌పై చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటకు వచ్చారు. మధ్యలో మద్యం సేవించారు. తూప్రాన్‌పేట శివారులోని గ్రీన్‌సిటీ వెంచర్‌లోకి వెళ్లి మళ్లీ మద్యం తాగారు. ఇదే అదునుగా భావించి రమేష్ తలపై కర్రతో కొట్టారు. రమేశ్ పారిపోతుండగా పట్టుకుని బియ్యం బస్తాతో ఉరేసి చంపేశారు. అక్కడి నుంచి భాస్కర్, రియాజ్ పారిపోయారు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో భాస్కర్, రియాజ్ బైక్‌పై చౌటుప్పల్‌కు వస్తుండగా తూప్రాన్‌పేట వద్ద తనిఖీలు నిర్వహించిన పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులు నేరాన్ని అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎటూ పాలుపోవడం లేదు

● పాడి రైతులకు అందని పాల బిల్లులు ● మూడు మాసాలుగా బిల్లులు చెల్లించని మదర్ డెయిరీ ● లీటర్‌కు రూ.4 బోనస్‌కు మంగళం..?



రైతు దేశానికి వెన్నుముక. ఆ రైతుకు వెన్నుముక పాడి. ఆ రైతులకు పాల బిల్లులు చెల్లించకుండా మదర్ డెయిరీ జాప్యం చేస్తోంది. ప్రతి 15 రోజులకు ఒకసారి పాడి రైతులకు బిల్లు చెల్లించాల్సి ఉంది. మార్చి నుంచి ఇప్పటి వరకు మూడు మాసాలుగా (ఆరు బిల్లులు) బిల్లు చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచింది. అవసరానికి డబ్బులు అందకపోవడంతో పాడి రైతులు ఆవేదన చెందుతున్నారు.

● (ఆంధ్రజ్యోతి మోత్కూరు)

కూలీలకు, వ్యాపారులకు రోజు వారీగా, ఉద్యోగులకు నెలనెలా ఆదాయం(వేతనం) వస్తుండగా, రైతుకు పంట దిగుబడి వచ్చే వరకు పెట్టుబడికి ఖర్చు పెట్టడమే తప్ప దమ్మిడి ఆదాయం రాదు. పంట దిగుబడి రావడానికి ఐదారు మాసాలు పడుతుంది. అప్పటి వరకు కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఇతర ఖర్చులకు అవసరమొస్తుందని రైతులు వ్యవసాయానికి అనుబంధంగా ఆవులనో, గేదెలనో సాకుతున్నారు. పాలు తాగే కుటుంబాలకు అమ్ముకోవాలంటే ఇంటింటికి తిరిగి పోయాలి. అందరూ ఒకేసారి బిల్లు ఇవ్వరు. ఒకేసారి బిల్లు వస్తే అవసరాలకు ఉపయోగపడుతుందని, ఇంటింటికీ తిరిగి పాలు పోయలేక రైతులు పాల సంఘాలకు పాలు పోస్తున్నారు. సంఘాలు పాడి రైతులకు ప్రతి 15రోజులకోసారి బిల్లు చెల్లించాల్సి ఉంది. మదర్ డెయిరీ యాజమాన్యం గత మార్చి నుంచి ఇప్పటివరకు మూడు మాసాలుగా ఆరు బిల్లులు చెల్లించ లేదు. ఇప్పుడు జూన్ మాసం. ఈ నెలలో పిల్లల చదువు లకు పాఠశాలలు, కళాశాల ఫీజులు, దుస్తులు, పుస్తకాలు తదితర ఖర్చులు ఉంటాయి. ఇదీ ఖరీఫ్ పంటల సాగు సీజన్ కూడా. పంటల సాగు ఖర్చులు ఉంటాయి. మూడు మాసాలుగా బిల్లు అందక ఇబ్బందులు పడుతున్నారు. తమకు రావాల్సిన డబ్బు రాక కుటుంబ అవసరాల కోసం అప్పులు చే యాల్సివస్తోందని, అప్పులకు వడ్డీ అవుతోందని ఆవేదన చెందుతున్నారు.

మదర్ డెయిరీ ఆధ్వర్యంలో 300 సొసైటీలు

ఉమ్మడి నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల్లో మదర్‌డెయిరీ పరిధిలో 24 పాల శీతలీకరణ కేంద్రాలు, సుమారు 300సొసైటీలు(పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు) ఉన్నాయి. ఈ సంఘాల్లో సుమారు 65 వేల మంది రైతులు(సభ్యులు) ఉన్నారు. సొసైటీల ద్వారా రోజుకు సుమారు 60 వేల నుంచి 70 వేల లీటర్ల పాలు సేకరిస్తోంది.

రైతుల ఆందోళన బాట

మదర్ డెయిరీ మూడు మాసాలుగా పాడి రైతులకు బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు ఆందోళన బాట పట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం రాగిబావి గ్రామానికి చెందిన పాడి రైతులు ఇటీవల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మోత్కూరు పాలశీతలీకరణ కేంద్రానికి తాళం వేశారు. తమకు బిల్లులు చెల్లించే వరకు తాళం తీసేది లేదని ఆందోళన చేశారు. పాలు తీసుకెళ్లడానికి వచ్చిన పాల ట్యాంకర్‌ను కేంద్రంలోకి వెళ్లనివ్వలేదు. దీంతో దిగొచ్చిన అధికారులు ఆ రైతులకు ఒక నెల బిల్లు రూ.1.50 లక్షలు అప్పటికప్పుడు చెక్కురాసి ఇచ్చి చెల్లించారు.

పాడి రైతులకు రూ.35.10 కోట్లు బాకీ

మదర్ డెయిరీ రోజూ సుమారు 60వేల నుంచి 70వేల లీటర్ల పాలు సేకరిస్తోంది. వెన్న శాతాన్ని బట్టి లీటరు రూ.40 నుంచి రూ.100 రేటు చెల్లిస్తారు. సగటున రోజుకు 60వేల లీటర్ల పాలు డెయిరీకి వస్తాయనుకున్నా, లీటరుకు సగటున రూ.65చొప్పున లెక్కిం చినా రోజుకు రూ.39లక్షల బిల్లు అవుతుంది. 15రోజులకు రూ.5.85 కోట్లు అవుతుంది. మూడు మాసాలకు ఆరు బిల్లులు రూ.35.10 కోట్లు చెల్లించాల్సి ఉంది.

బోనస్‌కు మంగళం..?

పాడి రైతులను ప్రోత్సహించడానికి, వారు నష్టాల పాలు కాకుండా ఆదుకోవడానికి 2017 నవంబరులో అప్పటి సీఎం కేసీఆర్ లీటరు పాలకు రూ.4 బోనస్ ఇస్తామని ప్రకటించారు. కొన్నేళ్లుగా గత ప్రభుత్వంతో పాటు, ఈ ప్రభుత్వం కూడా పాడి రైతులకు బోనస్ చెల్లించకపోవడంతో బోనస్‌కు మంగళం పాడినట్టేనంటున్నారు. తమకు పక్కాగా జ్ఞాపకం లేదగాని ఐదేళ్లుగా బోనస్ రావడం లేదని కొందరు, నాలుగేళ్లుగా రావడం లేదని మరికొందరు పాడి రైతులు చెబుతున్నారు. రోజుకు 60వేల లీటర్లకు రూ.4 చొప్పున రూ.2.40లక్షలు, ఏడాదికి రూ.8.76కోట్లు, నాలుగేళ్లకు లెక్కించినా రూ.35.04కోట్లు బోనస్ చెల్లించాల్సి ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.



మోత్కూరు పాల శీతలీకరణ కేంద్రానికి తాళం వేసిన పాడి రైతులు (ఫైల్)

లక్ష్మీనర్సింహారావుకు డాక్టర్ ఆఫ్ సోషల్ వర్కర్ అవార్డు

చౌటుప్పల్ రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం గ్రామానికి చెందిన పంతంగి లక్ష్మీనర్సింహారావు డాక్టర్ ఆఫ్ సోషల్ వర్కర్ అవార్డు అందుకున్నారు. జర్మనీకి చెందిన యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ అవార్డు ప్రకటించింది. తమిళనాడు రాష్ట్రం ఊటిలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీనర్సింహారావుకు ఆ సంస్థ ప్రతినిధులు అవార్డు అందజేశారు. 20సంవత్సరాలుగా వివిధ సామాజిక పర్యావరణ వాతావరణ మార్పుల సమస్యలపై సేవలు అందించినందుకు అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సేవలు గుర్తించి డాక్టర్ ఆఫ్ సోషల్ వర్కర్ అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు.



అవార్డు అందుకుంటున్న లక్ష్మీనర్సింహారావు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి



సైదులుగౌడ్ (ఫైల్)

కనగల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో భాగంగా బైక్‌పై విచారణకు వెళ్లి తిరిగి పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న ఓ హెడ్‌కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలం దర్వేశిపురం స్టేజీ సమీపంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గులపల్లి మండలంలోని ఆగమోత్కూర్ గ్రామానికి చెందిన బొల్లెపల్లి సైదులుగౌడ్(47) నల్లగొండలో నివాసముంటూ కనగల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం ఉదయం విచారణ నిమిత్తం ద్విచక్ర వాహనంపై జీచెన్నారం గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో దర్వేశిపురం స్టేజీకి కొద్దిదూరంలో నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని సైదులుగౌడ్‌ను 108వాహనంలో నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ పరిస్థితి విషయమించడంతో మృతిచెందారు. ఆయనకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి సందర్శించారు. హెడ్‌కానిస్టేబుల్ సైదులుగౌడ్ మృతితో కనగల్ పోలీస్‌స్టేషన్‌లో విషాదచాయలు అలుముకున్నాయి.

రోడ్డు దాటుతుండగా...

భువనగిరి రూరల్: మోపెడ్ వాహనంపై రోడ్డు దాటుతున్న వ్యక్తిని అతివేగంగా వస్తున్న టిప్పర్ వాహనం ఢీకొట్టడంతో మృతిచెందాడు. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టకు చెందిన కీర్తి వెంకటేశ్వర్లు(60) పని నిమిత్తం మోపెడ్‌పై మండలంలోని వడాయిగూడెం గ్రామం వద్ద రోడ్డు దాటుతుండగా యాదగిరిగుట్ట నుంచి రాయిగిరి వైపు అతివేగంగా వస్తున్న టిప్పర్ వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేశ్వర్లు భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని...



కడారి శ్రీను (ఫైల్)

నాగారం: సూర్యాపేట జిల్లా నాగారం మండలంలోని నాగారం బంగ్లా గ్రామపంచాయతీ పరిధిలోని విజయనగర్ వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. పసునురు గ్రామానికి చెందిన కడారి శ్రీను(50) డి.కొత్తపల్లిలో శనివారం జరిగిన గంగదేవమ్మ గుడి పండుగకు తమ సమీప బంధువు ఇంటికి వెళ్లాడు. సోమవారం రాత్రి హైదరాబాద్‌కు వెళ్లడానికి కొత్తపల్లి నుంచి నాగారం వైపు నడుచుకుంటూ వస్తుండగా విజయనగర్ సమీపంలో జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీను హైదరబాద్ హయత్‌నగర్‌లో ఐదేళ్ల నుంచి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. శ్రీనుకు భార్య, ఇద్దరు కూమారులు ఉన్నారు. పెద్దకూమారుడి సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎం. ఐలయ్య తెలిపారు.

ఆటో ఢీకొని వృద్ధుడు మృతి..

మోత్కూరు: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండలం కంచనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కమ్మగూడెం గ్రామానికి చెందిన తిప్పబత్తిని రాజయ్య(73) రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళుతున్నాడు. ఆ సమయంలో మోత్కూరు నుంచి చిన్నపడిశాల గ్రామానికి వెళుతున్న ఆటోను డ్రైవర్ బండారి వెంకటేష్ అజాగ్రత్తగా, అతివేగంగా నడుపడంతో పాటిమట్ల గ్రామం వద్ద పల్టీకొట్టి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న రాజయ్యపై పడింది. తీవ్రంగా గాయపడిన రాజయ్యను చికిత్సనిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. రాజయ్య కుమారుడు విజయభాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గేదెను ఢీకొని యువకుడు



మచ్చ సందీప్ (ఫైల్)

గరిడేపల్లి: బైక్‌పై వెళ్తున్న యువకుడు గేదెను ఢీకొని మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి గరిడేపల్లి మండలంలో జరిగింది. ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కోదండరాంపురం గ్రామానికి చెందిన మచ్చ సందీప్(31) బైక్‌పై సోమవారం తన స్నేహితుడితో కలిసి మఠంపల్లి మండలం పెదవీడు గ్రామం వెళ్లి అతనిని అక్కడ దించి కోదండరాంపురం బైక్‌పై తిరిగి వస్తుండగా రాత్రి 10.30 గంటల సమయంలో కోదా డ, మిర్యాలగూడ ప్రధాన రహదారిపై మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామ శివారులో శ్రీవిజయ రైస్‌మిల్లు వద్ద అకస్మాత్తుగా పొలంలో నుంచి గేదె రోడ్డుపైకి రావడంతో బైక్‌పై ఉన్న సందీప్ గేదెను బలంగా ఢీకొట్టి రోడ్డుపై పడడంతో తలకు గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. సందీప్ తండ్రి సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబానికి అండగా సాగుతూ

▸▸ కూరగాయల సేద్యంలో రాణిస్తున్న అర్వపల్లి మహిళలు ▸▸ కాలానికి అనుగుణంగా పంటలు ▸▸ 40 కుటుంబాల మహిళల సాగుబాట

కూరగాయలు, ఆకుకూరల సాగును జీవనోపాధిగా మలుచుకున్నారు సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి గ్రామానికి 40 కుటుంబాల మహిళలు. 50 ఏళ్లుగా వారు కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తూ వచ్చిన ఆదాయంతో కుటుంబాలకు అండగా ఉంటున్నారు. కుటుంబ పోషణ, పిల్లల చదువు, అమ్మాయిల పెళ్లిళ్ల కోసం ఆసరాగా ఉంటున్నారు. వ్యవసాయ క్షేత్రాల వద్ద ఉన్న కొద్దిపాటి భూముల్లో స్వయంగా కూరగాయలు, ఆకుకూరలు సేద్యం ఆదర్శంగా నిలుస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి అర్వపల్లి)



అర్వపల్లిలో పాలకూర, చుక్కకూర తోటలను సేద్యం చేస్తున్న మహిళలు

కాలానికి అనుగుణంగా వ్యవసాయ భూముల్లో సేంద్రియ ఎరువులతో ఆకుకూరలు, కూరగాయలతోపాటు రకరకాల పంటలు పండిస్తున్నారు. టమాట, బెండకాయ, గోకరకాయ, సోరకాయలు, దోసకాయ, మునగకాయలు, వంకాయలు, పచ్చిమిర్చి, బీరకాయలతో పాటు ఆకుకూరలైన పాలకూర, తోటకూర, చుక్కకూర, గంగబాయిలీకూర, బచ్చలికూర, కొత్తిమీర, పుదీనా, మెంతుకూర, గోంగూర పంటలను ఎకరం, అర ఎకరం స్థలంలోనే సేద్యం చేస్తున్నారు. చిన్న చిన్న మడులు చేసి పంటలు పండిస్తున్నారు. ఉదయం ఐదు గంటలకే కూరగాయలు, ఆకుకూరల తోటలకు వెళ్లి పంట పనుల్లో నిమగ్నమవుతారు.

తాజా కూరగాయలతో గిరాకీ

కూరగాయలు, ఆకుకూరలు తాజాగా ఉండడంతో గిరాకీ ఉంటుంది. లాభసాటిగా పండిస్తూ ఆదాయం పొందుతున్నారు. ఇతర జిల్లాలో ఉన్న సంతలో విక్రయించడానికి మహిళలు ఆటోల్లో వెళ్లి విక్రయిస్తారు. జనగాం జిల్లా దేవరప్పుల,జిల్లాలో తిరుమలగిరి, అ ర్వపల్లి,నూతనకల్,మద్దిరాల, ఫణిగిరి, నెమ్మికల్, శా లిగౌరారం, తుంగతుర్తి గ్రామాల సంతల్లో తమ పంటలను విక్రయిస్తారు.



కూరగాయలు అమ్ముతున్న మహిళ

ఆకుకూరలనే నమ్ముకున్నా



మాకు ఉన్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో కూరగాయలు, ఆకు కూరలు సేద్యం చేస్తూ జీవనం సాగిస్తున్నాం. ఉదయం నుంచి పంటల వద్దకు వెళ్లి సేద్యం చేస్తున్నాం. తాజా కూరగాయలు, ఆకుకూరలు పండించడంతో మార్కెట్, సంతల్లో కూరగాయలకు గిరాకీ ఉంది. కూరగాయలను అమ్ముకొని కుటుంబాలను పోషించుకుంటున్నాం.

- కనుకు పద్మ, మహిళా రైతు అర్వపల్లి.

లాభసాటిగా ఉంది



ఆకుకూరలు, కూరగాయల సాగుతో మాకు లాభసాటిగానే ఉంది. మంచి ఆదాయం పొందుతున్నాం. కష్టపడి కూరగాయలు, ఆకుకూరలను సాగు చేస్తున్నాం. ప్రతి సంవత్సరం టమాట, సోరకాయ, బెండకాయ ఎక్కువగా పండిస్తాం. 50ఏళ్లుగా ఈ పంటలు సాగు చేస్తున్నాం. అర్వపల్లి సంతతో పాటు ప్రతిరోజూ 365వ జాతీయ రహదారిపై పుదీనా, కొత్తిమీర, మునగకాయలను విక్రయిస్తాం.

- కట్టెల విజయ, మహిళా రైతు అర్వపల్లి.

కుటుంబాలను పోషించుకుంటున్నాం



ఏళ్ల తరబడి నుంచి కూరగాయలు,ఆకుకూరలు పండించుకుంటూ కుటుంబాలను పో షించుకుంటున్నాం. ఈ పంటలతో పిల్లల చదువుల ఖర్చులకుఆసరాగా ఉంటున్నాయి. జిల్లా దాటి సంతల్లో ఆకుకూరలు విక్రయిస్తాం. కూరగాయలు తాజాగా ఉండడంతో గిరాకీ ఉంటుంది.

- మేకల రజిత, మహిళా రైతు అర్వపల్లి.

ప్రైవేటు వల



- ఇంటర్ ప్రవేశాల కోసం కళాశాలలు జోరుగా ప్రచారం
- ఇంటింటికీ తిరుగుతున్న పీఆర్‌వోలు

మా కాలేజీలో చదివితే మీ పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. జేఈఈ మెయిన్స్, ఎంసెట్‌లో మంచి ర్యాంక్ వ స్తుందంటూ ఇంటర్ ప్రైవేటు కళాశాలలు ప్రచారం హో రెత్తిస్తున్నాయి. జిల్లాలోని పలు గ్రామాల్లో కళాశాలల యాజమా న్యాలు పీఆర్వోలను ఇంటింటికీ పంపిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను సంప్రదిస్తూ ప్రవేశం పొందుతున్నారు. వారి నుంచి రూ. లక్షల్లో ఫీజు వసూలు చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

విద్యార్థుల ప్రవేశాల కోసం ప్రచారం హోరెత్తిస్తున్నాయి. పదోతరగతి పూర్తయిన విద్యార్థుల ఇళ్లకు వచ్చి తమ కాలేజీలో చేరితే జేఈఈ మెయిన్స్, నీట్ ర్యాంకులు పక్కా వస్తాయని ఆశలు చూపి అడ్మిషన్లు తీసుకునేలా ప్రచారం సాగిస్తున్నారు. ఏడాదికి రూ.లక్షల ఫీజులు వసూలు చేస్తున్నారు. పదోతరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసమంటూ హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో చేర్పిస్తున్నారు. దీంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేరుతున్నా పిల్లల సంఖ్య ఏటా తగ్గిపోతోంది. పదోతరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు హైదరాబాద్, ఘట్‌కేసర్, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని కాలేజీల్లో చేరుతుంటే.. అంతంతే మార్కులు వచ్చిన వారు స్థానికంగా ఉన్న జూనియర్ కాలేజీల్లో చేరుతున్నారు. ఫలితంగా ఇంటర్మీడియేట్‌లో ఫలితాలు తగ్గిపోతున్నాయి. ఇంటర్ ప్రవేశాలపై ప్రభుత్వ ఆజమాయిషీ లేకపోవడంతో ప్రైవేటు, కార్పొరేట్ కళాశాల ల పీఆర్వోలు పల్లెల్లోకి వచ్చి విద్యార్థుల అడ్మిషన్లు తీసుకుంటున్నారు. హైదరాబాద్‌కు అతి చేరువలో ఉన్న భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్ మున్సిపాలిటీలతోపాటు బీబీనగర్, భువనగిరి తదితర పట్టణాల్లో ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల ప్రచారం విస్తృతంగా జరుగుతున్నాయి. అడ్మిషన్ల కోసం అనేక మార్గాలు అన్వేషిస్తున్నారు. ఎలాగైనా విద్యార్థులు, తల్లిదండ్రులను ఒప్పించి తమ కాలేజీల్లో చేరాలని కోరుతూ కరపత్రాలు, వాల్‌పోస్టర్లతో ప్రచారం సాగిస్తున్నారు.

ఆర్థిక దోపిడీకి అరికట్టేదెవరు..?

పదో తరగతి ఫలితాలు రావడంతో ఇప్పటికే కార్పొరేట్ కళాశాలల పీఆర్వోలు విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. వారిని ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నలయ్యారు. పదోతరగతి చదివి ఉత్తీర్ణులైన పాఠశాలల యాజమాన్యాలకు తాయిలాలు ఇస్తూ వారిని తమ వైపు తిప్పుకుంటున్నారు. కొన్ని కాలేజీలు విద్యార్థులకు కాలేజీలో అడ్మిషన్ చేయిస్తే.. ఇంత ఇస్తామని హామీ ఇస్తున్నారు. కమీషన్‌దారులు గ్రామాల్లోని తమకు తెలిసిన వారిని కాలేజీల్లో చేర్పిస్తున్నారు. కొన్ని కాలేజీల వారు విద్యార్థుల నుంచి కొంత ఫీజు తీసుకుని అడ్మిషన్లు కూడా ఇచ్చేస్తున్నారు. అయితే కాలేజీలు ఆరంభం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులను తమ కళాశాలలకు ఆహ్వానిస్తున్నారు. కాలేజీ ప్రత్యేకతలు వివరిస్తున్నారు. వారి మాటలకు ఆకర్షితులైన తల్లిదండ్రులు కొందరు కొంత మొత్తం డబ్బులు చెల్లించి మరీ అడ్మిషన్లు తీసుకుంటున్నారు. బోధన విధానం, హాస్టల్‌లో ఫుడ్, ఇతర ఏ అంశంలోనైనా నచ్చక విద్యార్థి ఇంతకి తిరిగి వస్తే కాలేజీ వారు ఫీజు తిరిగి ఇవ్వరు. ఒక వేళ ఇచ్చినా ఎంతో కొంత కట్ చేసుకునే ఇస్తారు. డిగ్రీ 'దోస్త్' తరహాలో ఇంటర్‌లోనూ 'ఆన్‌లైన్' ప్రవేశాలు చేపడితే ఇలాంటి ఇబ్బందులకు అవకాశం ఉండదని విద్యార్థులు, తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఆర్థిక దోపిడీని ఎవరు అరికడుతారని ప్రశ్నిస్తున్నారు.

అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి



ఈ విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. బోర్డు అధికారులు జారీ చేసిన నోటిఫికేషన్ల బట్టి ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతుంది. ఇప్పటికైతే డిగ్రీ తరహా 'దోస్త్' ఆన్‌లైన్ విధానం లేదు. ఎప్పటిలాగే పాత పద్ధతిలోనే కాలేజీల వారీగా అడ్మిషన్లు జరుగుతున్నాయి. జిల్లాలోని 10 ప్రభుత్వ, 32 ప్రభుత్వ అనుబంధ, 20ప్రైవేటు కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది.

- రమణి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి యాదాద్రి

'ప్రైవేట్' ఒత్తిడికి చెక్ పడేదెప్పుడో...?

ఇంటర్ ప్రవేశాల్లో 'దోస్త్' తరహాలో ఆన్‌లైన్ విధానం అమలైతే విద్యార్థులపై ఒత్తిడి తగ్గి మేలు కలిగే అవకా శం ఉంటుంది. విద్యార్థులు తమకు నచ్చిన కాలేజీ ను ప్రాధాన్యతా క్రమంలో ఎంపిక చేసుకునే వీలుంటుంది. పదో తరగతిలో వచ్చి న మా ర్కులు, రిజర్వేషన్లు ఆధారంగా ఇంటర్ లో సీట్ల కేటాయింపులు జరిగితే విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలలో చదివే అవకాశం లభిస్తుంది. విద్యార్థులపై ఒత్తిడికి చెక్ పెట్టాల్సిందిగా తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాత విధానమే..

ఈ విద్యాసంవత్సరం ఇంటర్మీడియట్‌లో విద్యార్థుల ప్రవేశాల కోసం పాత విధానాన్నే అమలు చేయనున్నారు. తొలుత డిగ్రీ ప్రవేశం మాదిరి 'దోస్త్' తరహా ఆన్‌లైన్ విధానం అమలు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డు భావించింది. కానీ, ప్రస్తుతం అమలుకు వీలు కాదని బోర్డు అధికారులు తేల్చి చెప్పారు. దీంతో పాతవిధానం అమలుకు నిర్ణయించారు. ఫలి తంగా ప్రైవేటు కళాశాలలు, కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలు, అధ్యాపకులు పదో తరగతి విద్యార్థుల ఇళ్ల వద్దకు వచ్చి అడ్మిషన్లు చేయించుకుంటున్నారు. యాదాద్రి-భువనగిరి జిల్లాలో 10 ప్రభుత్వ, 32 ప్రభుత్వ అనుబంధ, 20 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. ఆయా కాలేజీల్లో ఏటా ప్రవేశాల సం ఖ్య తగ్గిపోతూనే ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	512 అడుగులు
టీఎంసీలు	135.0900
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	4.050
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	450 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	4,500 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	25.10 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	634.80 అడుగులు
టీఎంసీలు	3.21
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	347. 68క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	87.88 క్యూసెక్కులు

ఎల్లమ్మ జాతరకు వేళాయె

- రేపటి నుంచి ఈ నెల 7వ తేదీ వరకు దర్వేశిపురం ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



(ఆంధ్రజ్యోతి - కనగల్)

నల్లగొండ జిల్లా కనగల్ మండలం దర్వేశిపురం(పర్వతగిరి) స్టేజీ వద్ద స్వయంభువుగా వెలసిన రేణుకా ఎల్లమ్మ ఆలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి 7 వరకు వైభవంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయానికి వివిధ రంగులు వేసి విద్యుదీపాలతో అలకరిస్తున్నారు కల్యాణ మండపం చుట్టూ భ క్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు వేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తుంది.

పూజలు ఇలా..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 5న గురువారం ఉదయం మంగళవాయిద్యాలతో సుప్రభాతసేవ, లలిత సహస్రనామార్చన, బాలభోగ నివేదన, ధ్వజారోహణం, దేవి మూలమంత్ర హోమాలు, మండప పూజలు, నీరజానమంత్ర పుష్పములు, మహానివేదన, గవ్యాంత పూజలు, వాస్తుపూజ నిత్యహోమాలు, విఘ్నేశ్వరపూజలు, స్వస్తివాచనం, పంచగవ్యప్రాసవ, రక్షాబంధనం, అఖండ దీపారాధన ఋత్విక్‌దీక్షాధారణ, త్రిశూలపూజ మధ్యాహ్నం చండీహోమం, ఎదుర్కోళ్ల మహోత్సవం, 6న మంగళవాయిద్యాలతో సుప్రభాత సేవ, లలిత సహస్రనామార్చన, బాలభోగ నివేదన ఉదయం 10:30 గం. అమ్మవారి తిరుకల్యాణ మహోత్సవం, 7న ఉదయం గవ్యాంత పూజలు, 108 కలశంతో అష్టోత్తర శతఘటాభిషేక మహోత్సవం, మత్స్యోపాసన బలిహరణ, త్రిశూల స్నానం, సాయంత్రం 4 గంటలకు దర్వేశిపురం, పర్వతగిరి గ్రామస్తులతో బోనాలు రాత్రి ఏకాంత సేవ, నీరజాన మంత్రపుష్ప కార్యక్రమాలు జరుగనున్నవి. కల్యాణ మహోత్సవానికి రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా రాష్ట్ర ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హాజరు కానున్నారు. కాగా జాతర హాజరై భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు, ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆలయం వద్ద తాగునీటి వసతి, పారిశుధ్య పనులు జరుగుతున్నట్లు కల్యాణం రోజు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసుల సహకారం తీసుకుంటున్నట్లు ఆలయ ఈవో జయ రామయ్య చెప్పారు.

ఆంజనేయుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్ర పాల కుడు అంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద అంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్పటికమూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్ర హావనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో అంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 31,13,574 ఆదాయం సమ కూరినట్లు ఈవో వెంకట్రావ్ తెలిపారు.



క్షేత్రపాలకుడికి హారతి ఇస్తున్న అర్చకుడు

గ్రామగ్రామాన నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తం



విత్తన సంచులు అందజేస్తున్న సూర్యాపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామారావు

కోదాడ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామగ్రామాన నాణ్యమైన విత్తనాలు అందించేందుకు రైతన్నకు నేస్తం దోహదపడుతుందని సూర్యాపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత సంధ్యారాణిలు అన్నారు. మంగళవారం కోదాడ మండలంలోని కాపుగల్లు రైతువేదికలో ఎంపిక చేసిన రైతులకు విత్తన సంచులను వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాపుగల్లు సహకార సంఘ చైర్మన్ నంబూరి సూర్యం, ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయాధికారి పాలెం రజని, ఏఈఓలు ఝాన్సీ, సల్మా, మహేష్, నగేష్, రైతులు జాబిశెట్టి నాగప్రసాద్, బొల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివన్నగూడెం నుంచి లిఫ్ట్ నీటిని తరలిస్తాం

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పథకం దిగువన ఉన్న ఎదుల్ల మీదుగా శివన్నగూడెం రిజర్వాయర్‌కు నీటిని తీసుకొచ్చి సంస్థాన్‌నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు లిఫ్ట్‌ద్వారా నీటిని తరలిస్తామని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడు రైతు వేదికలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో యువరైతులకు పంటల సాగుపై నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కష్టాన్ని నమ్ముకొని ఆరుగాలం శ్రమిస్తూ వ్యవసాయం చేస్తున్న రైతులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ రంగంలో ప్రధాన వనరుగా అవసరపడే నీటిని ఈ ప్రాంతానికి తీసుకొచ్చే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. కురిసిన వర్షం నీటిని వృథాగా పోనియకుండా ప్రతీ చుక్కనూ ఒడిసి పట్టడానికి ప్రత్యేక కార్యాచరణతో ప్ర ణాళికలను రూపొందించామన్నారు. అందులో తొలిదశగా 148 చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఉద్యానవన శాఖ జిల్లా అధికారి అనంతరెడ్డి మాట్లాడుతూ రైతులు పంటల సాగులో అనువైన సమయం పాటించటం కీలకమన్నారు. పంటల సాగులో ఆధునిక పద్ధతులను పాటిస్తూ తమ శాఖ అధికారుల సలహాలు, సూచనలతో అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ నియోజకవర్గ అధికారి విద్యాసాగర్, ఏవో పద్మజ పాల్గొన్నారు.



మునుగోడులో నిర్వహించిన శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

- మునుగోడులోని సర్వే నెంబరు 78లో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మించేందుకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు పాఠశాల నిర్మాణం కోసం పలువురు రైతులు తమ పట్టా భూములను విరాళంగా ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. మునుగోడు చెందిన మేడి ముత్తయ్య రైతు తనకున్న మూడు ఎకరాల అసైన్డ్ పట్టా భూమిని పాఠశాల నిర్మాణానికి అందజేశారు. దీంతో ముత్తయ్యను ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మంగళవారం క్యాంపు కార్యాలయానికి పిలిపించి శాలువాతో ప్రత్యేకంగా సన్మానించారు.

640అడుగులకు మూసీ ప్రాజెక్టు నీటిమట్టం



వరద నీటితో కళకళలాడుతున్న మూసీ రిజర్వాయర్

కేతేపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద నీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతోంది. ఎగువన గల హైదరాబాద్ నగరంతో పాటు మేడ్చల్, మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, యాదాద్రిభువనగిరి, జనగాం తదితర జిల్లాలకు చెందిన పలు ప్రాంతాల్లోని వాగులు, వంకల నుంచి క్రమం తప్పకుండా వరద నీరు వచ్చి ప్రాజెక్టులో చేరుతుంది. దీంతో వానాకాలం ప్రారంభంలోనే ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టానికి చేరువలోకి వచ్చింది. ఎగువ నుంచి నిరంతరం వస్తున్న వరద నీటితో 645 అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 640 అడుగుల (3.21టీఎంసీలు)కు చేరింది. ఎగువ నుంచి 347 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరడానికి మరో ఐదు అడుగుల మేర నీరు చేరాల్సి ఉంది.

గ్లోబల్ యూత్ సమ్మిట్ 25కు
ఎంజీయూ విద్యార్థినుల ఎంపిక

నల్లగొండ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వం, మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎంపవర్‌మెంట్ అండ్ స్పోర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 5,6 తేదీల్లో కర్ణాటకలోని మంగళూరులోని యానేపోఈ డీమ్డ్ యూనివర్సిటీలో గ్లోబల్ యూత్ సమ్మిట్ 2025ను నిర్వహిస్తున్నారు. ఈ సమ్మిట్‌కు మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్లు ఎంపికయ్యారు. టీటీ డబ్ల్యూఆర్‌డీసీ సూర్యాపేట, టీజీ డబ్ల్యూఆర్ఎఎఫ్‌బీడీసీ భువనగిరి కళాశాలలకు చెందిన విద్యార్థినులు మనీషా, సిరివెన్నెల ఎంపికైనట్లు విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ పసుపుల మద్దిలేటి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను మంగళవారం ఎంజీయూ వీసీ ఖాజాఅల్తాఫ్‌హుస్సేన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో టీటీడబ్ల్యూఆర్‌డీసీ ప్రిన్సిపాల్ సునీల తదితరులు పాల్గొన్నారు.



ఎంపిక పత్రం చూపుతున్న వీసీ అల్తాఫ్ హుస్సేన్

హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను సన్మానిస్తున్న ఏవీఎం కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న శ్రీకాంత్‌రెడ్డి

నకిరేకల్, జూన్3 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ చా టారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామంలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ బాల బాలికల ఛాంపియన్‌షిప్ పోటీల్లో నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలోని ఏవీఎం పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థినులు నామ నిఖిత, రమావత్ సిద్దు ప్రతిభ కనబరిచినట్లు మంగళపల్లి హైస్కూల్ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నిమ్మల శంకర్‌గౌడ్ తెలిపారు. ఇటీవల మంగళపల్లి హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా జూనియర్ బాల, బాలికల జిల్లా జట్టులో వారు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంగళవారం ఏవీఎం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమలో కళాశాల ప్రిన్సిపాల్ కందాళ స్వప్నశ్రీకాంత్‌రెడ్డి, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

హుజూర్‌నగర్ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ నాయకులు ముల్కలపల్లి రాంబాబు కోరారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగరన్ పట్టణంలోని ఇందిర సెంటరులో మలిదశ ఉద్యమకారులు చిలకరాజు అజయ్‌కుమార్, దొడ్డా నర్సింహారావు, తోట యలమందయ్య, పచ్చిపాల ఉపేందర్‌యాదవ్, మహేష్‌రాథోడ్‌లను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రతినెల రూ.20వేల పింఛన్, 250 గజాల స్థలం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రాము, సాయి, నాగరాజు, వెంకి, చాంద్, రఫి, శ్రీను, భాస్కర్‌రెడ్డి, యలమంద పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కేతేపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారజాతా మంగళవారం కేతేపల్లి మండలం వివిధ గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా మండలంలోని ఇనుపాముల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ సుశిక్షుతులైన ఉపాధ్యాయులు ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విశాలమైన తరగతి గదులు, ఆట స్థలాలు, డిజిటల్ తరగతులు, లైబ్రరీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధతో నిపుణులైన ఉపాధ్యాయులతో ఒత్తిడి లేని చదువు అందుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిత్తలూరి సత్యనారాయణ, పి.రమేష్, జయసాగర్, బి.శ్యామయ్య, రవికుమార్, కిషోర్, హరికృష్ణ, వేణుగోపాల్, కె.శ్రీనివాస్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



ఇనుపాములలో నిర్వహించిన యుటీఎఫ్ ప్రచార జాతాలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

వాక్ ఫర్ బెటర్ ఎన్విరాన్‌మెంట్ రేపు

సూర్యాపేట టౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈ నెల 5వ తేదీన గ్రీన్ క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే వాక్ ఫర్ బెటర్ ఎన్విరాన్‌మెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సుదర్శ్ పీపీసీ అధినేత మీలా మహదేవ్ కోరారు. మంగళవారం సూర్యాపేటలో వాక్ ఫర్ బెటర్ వాల్ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నరేందర్, కిరణ్, రామచంద్రయ్య, సురేష్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ వాహనాల వేలం పాట రేపు

తుంగతుర్తి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తుంగతుర్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 5వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రజిత తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. వివిధ రకాల 20 వాహనాలను ఈనెల 5న 10 గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నామని తెలిపారు. వేలంపాటలో పాల్గొనదానికి ఆసక్తి ఉన్నవారు నగదు డబ్బులను డిపాజిట్‌గా చెల్లించాలని కోరారు.

న్యూస్ బాక్స్

నిత్యావసర సరుకులు పంపిణీ

నేరేడుచర్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాన్‌పహాడ్ గ్రామంలో ఆవుల ప్రమీల, ఆవుల ఎల్లమ్మలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, దుస్తులు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బట్టు మధు, తక్కెళ్ల నాగార్జున, జిలకర రామస్వామి, ప్రభాకర్‌రెడ్డి, గుండెబోయిన సైదిరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, ఆరోగ్య నవీన్ పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

తిరుమలగిరి రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట పట్టణంలో ఈ నెలలో నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు వై.యాదగిరి కోరారు. మంగళవారం మండలంలోని వెలిశాల క్రాస్ రోడ్డులో జిల్లా మహాసభ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వెంకన్న, నర్సయ్య, ఎల్లారెడ్డి, మల్లయ్య, భీమా, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో అన్నదానం

సూర్యాపేట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగి గూడూరు సూర్యప్రకాశ్ తన వివాహ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని స్నేహ నిలయం ఆశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు నిర్మల, వినయ్, స్నేహ నిలయం ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు సహకరించాలి

నేరేడుచర్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నేరేడుచర్లలో హుజూర్‌నగర్ రోడ్డులో బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావుపూలే, సావిత్రీబాయిపూలే విగ్రహాల ఏర్పాటుకు అధికారులు సహకరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధూళిపాళ ధనుంజయనాయుడు కోరారు. మంగళవారం ప్రధాన కూడలిలో వీరబ్రహ్మేంద్రస్వామి గుడి పక్కన తాత్కాలికంగా విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ఫ్లెక్సీలు ఆవిష్కరణ చేశారు. పోలీస్, విద్యుత్ శాఖ అధికారులు అడ్డుకున్నారని అన్నారు. మునిసిపాలిటీ అధికారులు, తహసీల్దార్ జోక్యం చేసుకుని విగ్రహాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు రాపోలు నవీన్, కొణతం నాగిరెడ్డి, కొడమగుండ్ల నగేష్, వాస పల్లయ్య, ఇంజమూరి వెంకయ్య, యడవెల్లి చంద్రయ్య, శ్రీనివాస్, నీలా రామ్మూర్తి, సయ్యద్ హుస్సేన్, కుంజకర్, నాగయ్య, వెంకట్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

బూరుగడ్డ దేవాలయంలో ప్రత్యేక పూజలు

హుజూర్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగడ్డ గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో క్షేత్రపాలకుడు శ్రీఆంజనేయస్వామికి మంగళవారం పంచామృతాలతో అభిషేకం, గంధం, సింధూరం, పానకం, వడపప్పు, నారికేళం, ఫలహారం, వడమాలలతో నివేదించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మణ్‌రావు, గురవయ్య, హరీష్, నర్సింహారావు, కృష్ణప్రసాద్, హనుమంతరావు, కవిత, హరిప్రకుమార్, గిరిధర్, వీరయ్య, వెంకటేశ్వరరావు, సత్యం, పుష్పలత, అన్నపూర్ణ, సుమిత్ర, శిరీష, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి

ఆత్మకూర్(ఎస్), జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పత్తి, వరి, పెసర సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్శిటీ శాస్త్రవేత్త బద్దునాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో వంటసాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏవో దివ్య, ఏఈవోలు శివకుమార్, శివమూర్తి, పవన్, బాలాజీ, లక్ష్మీప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

మద్దిరాల, నేరేడుచర్ల జూన్ 3(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు వస్తాయని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎ.రాములమ్మ అన్నారు. మంగళవారం మద్దిరాల మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. రసాయన ఎరువుల వినియోగించకుండా సేంద్రియ ఎరువులను వాడితే అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. వివిధ పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో ఆనిషారోహ, ఏఈవోలు పాల్గొన్నారు.

● వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులందరూ నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలని అప్పుడే అధిక దిగుబడులు వస్తాయని నేరేడుచర్ల వ్యవసాయాధికారి జావిద్ అన్నారు. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో చేపట్టిన నాణ్యమైన 'విత్తనం రైతన్నకు నేస్తం' అనే కార్యక్రమాన్ని మంగళవారం మండలంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ఇసుక రీచ్.. స్థానికులకు తూచ్



» సూర్యాపేట, ఆత్మకూర్(ఎస్) మండలాల ట్రాక్టర్లతో ఇసుక తరలింపు
» ఆవేదన వ్యక్తం చేస్తున్న మండల ట్రాక్టర్ల యజమానులు

బిక్కేరు వాగులోకి వెళ్లకుండా పేరబోయినగూడెం గ్రామస్తులు అడ్డుకున్న మన ఇసుక మన వాహనం ట్రాక్టర్లు

నాగారం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నాగారం మండలంలోని పేరబోయినగూడెంలో మన ఇసుక -మన వాహనం ఇసుక రీచ్‌ను జిల్లా అధికారులు నాగారం మండల అధికారులకు సమాచారం లేకుండా ఏర్పాటు చేశారు. మండలానికి చెందిన ట్రాక్టర్ యజమానులు ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని తహసీల్దార్ కార్యాలయంలో అడిగినా మండలంలో ఎలాంటి ఇసుక రీచ్ ఏర్పాటు చేయడంలేదని అధికారులు తెలిపారు. ఐదేళ్ల సూర్యాపేట మండలానికి చెందిన 50 మంది ట్రాక్టర్ యజమానులు నాగారం తహసీల్దార్‌ను కలిసి మన ఇసుక- మన వాహనంలో పేరబోయినగూడెం ఇసుక రీచ్‌కు మైనింగ్ కార్యాలయంలో డీడీలు తీసి రిజిస్ట్రేషన్ చేసుకున్నామని, ఇసుక రీచ్‌ను ప్రారంభించమని కోరారు. అప్పటివరకు ఈ సమాచారం తహసీల్దార్‌కు కూడా తెలియలేదంటే అధికారుల మధ్య సమన్వయ లోపం కనపడుతోంది. ఇసుక రీచ్‌పై జిల్లా అధికారులు ప్రతిరోజు ప్రకటన కూడా జారీ చేయకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు తెలిపారు. కనీసం తమకు సమాచారం లేకుండా ఇసుక రీచ్‌ను ప్రారంభించడం పట్ల అధికారులపై నాగారం మండలంలోని ట్రాక్టర్ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక రీచ్ ఏర్పాటుపై మండల వాసులకు తెలియకుండా సూర్యాపేట ట్రాక్టర్ యజమానులకు ముందస్తు సమాచారం ఎలా తెలిసిందని అధికారులను ప్రశ్నిస్తున్నారు. నాగారం మండలంలో 200కు పైగా ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నాయని, తమకు తెలియకుండా పక్క మండలాల ట్రాక్టర్లను ఎలా అనుమతిస్తారని అధికారులను ప్రశ్నిస్తున్నారు. మండలంలోని పేరబోయినగూడెంలో బిక్కేరు వాగు నుంచి మన ఇసుక- మన వాహనాన్ని సూర్యాపేటకు చెందిన ట్రాక్టర్ యజమానులు సోమవారం ప్రారంభించారు.ఇసుక రీచ్ ప్రారంభానికి తహసీల్దార్‌కు కనీసం మీడియాకు కూడా సమాచారం అందించలేదు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత

పేరబోయినగూడెంలో బిక్కేరు వాగు నుంచి మన ఇసుక- మన వాహనం ట్రాక్టర్లలో ఇసుకను తరలించవద్దని ఇసుక ట్రాక్టర్లను గ్రామస్తులు, స్థానిక ట్రాక్టర్ యజమానులు మంగళవారం అడ్డగించారు. మంగళవారం వేకువజామున నాలుగు గంటలకే సూర్యాపేట, ఆత్మకూర్(ఎస్) మండలాలకు చెందిన 50 ట్రాక్టర్లు పేరబోయినగూడెం సమీపంలోని బిక్కేరు వాగులోకి వెళ్లాయి. ఇసుకు లోడు చేసుకుని తిరిగి వస్తుండగా గ్రామస్తులు గమనించి ట్రాక్టర్లను నిలిపివేశారు. ఈ విషయంపై నాగారం తహసీల్దార్‌కు గ్రామస్తులు ఫోన్‌లో సమాచారం అందించారు. కలెక్టర్ అనుమతితోనే శాండ్‌పాలసీలో భాగంగా ఇసుకను తరలిస్తున్నామని వివరించారు. ఇసుక పాలసీపై అభ్యంతరాలు ఉంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ గ్రామస్తులకు తెలిపారు. అధికారులు రావాలని కోరుతూ గ్రామస్తులు బైఠాయించారు. నాగారం ఎస్‌ఐ ఎం.ఐలయ్య సాయంత్రం సమయంలో గ్రామస్తులతో మాట్లాడి మంగళవారం బుక్ అయిన ఇసుక ట్రాక్టర్లను పాపారు. ఇసుక పాలసీపై గ్రామస్తులు, స్థానిక ట్రాక్టర్ యజమానుల తెలిపిన అభ్యంతరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని ఎస్‌ఐ తెలిపారు. నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రశాంత్, పేరబోయిన సంతోష్, నాగరాజు, అనిల్ , సురేష్, కాడారి అవిలయ్య, మధు, ప్రేమయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల క్రితమే సమాచారం అందింది

నాగారం తహసీల్దారుగా వారం రోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించాను. ఇసుక రీచ్‌పై ఉన్నతాధికారుల నుంచి రెండు రోజుల క్రితమే సమాచారం అందింది. నాగారం మండలం ఇసుక ట్రాక్టర్ యజమానులు కూడా మన ఇసుక మన వాహనంలో రిజిస్ట్రేషన్ కావాలని కోరారు. మన ఇసుక మన వాహనంతో గృహ నిర్మాణదారులకు అందుబాటులో ఇసుక దొరుకుతుంది. తెలిపారు. పక్క మండలాల ఇసుక ట్రాక్టర్లపై స్థానికులు తెలిపిన అభ్యంతరాలను కలెక్టర్‌కు, మైనింగ్ అధికారులకు తెలియజేస్తా.

- హరికిషోర్‌శర్మ, తహసీల్దార్, నాగారం

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి: సంకినేని



పెన్‌పహాడ్ మండలం అన్నారం బ్రిడ్జి గ్రామంలో మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

పెన్‌పహాడ్, ఆత్మకూర్(ఎస్), భానుపురి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయం సాధించేందుకు కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్‌రావు కోరారు. మంగళవారం పెన్‌పహాడ్ మండలంలోని అన్నారం బ్రిడ్జి గ్రామంలో ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో, ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్‌లో జరిగిన బీజేపీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 11సంవత్సరాల పరిపాలనలో దేశప్రగతి, దేశరక్షణ, పేదరిక నిర్మూలన ఇతరత్రా అభివృద్ధి అంశాలను ఈ నెల 20వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు అందరికీ అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సలిగంటి వీరంద్ర, పేర్వాల లక్ష్మణ్‌రావు,దరావత్ శ్రీనివాస్‌నాయక్, బిట్టు నాగరాజు, జంపాల వెంకన్న, రాచకొండ రామకృష్ణ, తాళ్లపల్లి మధు, నెమ్మాది నరేష్, పిరాములు, రాపర్తి వెంకన్న, తూముల సాయి, వీరేందర్, బొలిశెట్టి విద్యాయ్య, చెన్ను రమణారెడ్డి, గుడిపూరి శ్రీనివాస్, నారబోయిన అప్పయ్య, బొలిశెట్టి లింగయ్య, చామకూరి వెం

● ఆత్మకూర్(ఎస్)లో జరిగిన బీజేపీ సమావేశంలో మండల నూతన కమిటీని మండల అధ్యక్షుడు సంధ్యాల సైదులు ఆధ్వర్యంలో ప్రకటించారు. మండల ప్రధాన కార్యదర్శులుగా పాటి భద్రారెడ్డి, తూడి సాయిల్య, ఉపాధ్యక్షులుగా సకినాల వెంకన్న, బాణోత్ చిట్టునాయక్, తండు లింగయ్య, చందా కృష్ణమూర్తి, కంచం ఉప్పలయ్య, తేట్ల నమత, బొంగని సోమశేఖర్, కోశాధికారిగా సంధ్యాల మాధవిని నియమించారు. యువమోర్చా మండల అధ్యక్షుడిగా గోపగాని భానుప్రకాష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా సోమిరెడ్డి వీరారెడ్డి, దళిత మోర్చా మండల అధ్యక్షుడిగా ఆరెంపుల వంశీ, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడిగా గుగులోతు రవీందర్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా తేట్ల సైదులును నియమించారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా పందిరి రాంరెడ్డిని నియమించారు.

● చివ్వెంల మండల బీజేపీ కమిటీని మంగళవారం సూర్యాపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు ప్రకటించారు. మండల కార్యవర్గ సమావేశంలో మండల అధ్యక్షుడు మాదవరపు అనిల్ అధ్యక్షతన మండల ప్రధాన కార్యదర్శులుగా దొంగరి అంజయ్య, కెల్పూరి రాజేంకుమార్, ఉపాధ్యక్షులుగా బానోతు ధన్మయ్య, దరావత్ వీరన్న, గన్నోజు భరత్‌చారి, షేక్ జానీపాషా, కార్యదర్శులుగా దరావత్ రమేష్, వగ్గె జానయ్య, పెద్దపోలు రాజశేఖర్, దరావత్ లింగా, కోశాధికారిగా తండు సైదులును నియమించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్: భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తుంగతుర్తి ఆర్డీవో వేణుమాధవ్ అన్నారు. మంగళవారం తుంగతుర్తి మండలంలోని గానుగుబండ గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సును ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. అదే విధంగా నూతనకల్ మండలంలోని ఎర్రపహాడ్ గ్రామంలో దరఖాస్తులను స్వీకరించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ దయానందం డిప్యూటీ తహసీల్దార్ వంశీరాజ్ పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్‌లో వేపలసింగారంలో మేళ్లచెర్వు మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతుల నుంచి దరఖాస్తులను ఆర్డీవో శ్రీనివాసులు స్వీకరించారు. హుజూర్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో భూభారతిపై రైతులకు బుధవారం అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగార్జునరెడ్డి తెలిపారు.



హుజూర్‌నగర్ మండలం వేపలసింగారంలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు



తుంగతుర్తి మండలంలం గానుగుబండ గ్రామంలో మాట్లాడుతున్న ఆర్డీవో వేణుమాధవ్

● కోదాడలో రైతుల నుంచి దరఖాస్తులను ఆర్డీవో సూర్యనారాయణ స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వాజిద్‌అలీ పాల్గొన్నారు.

● పెన్‌పహాడ్‌లో దరఖాస్తులను తహసీల్దార్ దరావత్ లాలునాయక్, ఆత్మకూర్(ఎస్) మండలంలోని ఏనుబాముల, దాచారం గ్రామాల్లో దరఖాస్తులను తహసీల్దార్ అమీన్‌సింగ్, నేరేడుచర్ల మండలంలోని బోడలకున్ట గ్రామంలో దరఖాస్తులను తహసీల్దార్ సురిగి సైదులు, అర్వపల్లి మండలంలోని బొల్లంపల్లి, ఉయ్యాలవాడ గ్రామాల్లో దరఖాస్తులను తహసీల్దార్ శ్రీకాంత్, మద్దిరాల మండలంలోని రామచంద్రాపురం, జి.కొత్తపల్లి గ్రామాల్లో దరఖాస్తులను తహసీల్దార్ కుంట్లమయ్య, నాగారం మండలంలోని మామిడిపల్లి గ్రామంలో తహసీల్దార్ హరికిషోర్‌శర్మ, పాలకవీడు మండలంలో తహసీల్దార్ కమలాకర్, చింతలపాలెం మండలంలోని రేబల్లె గ్రామంలో దరఖాస్తులను తహసీల్దార్ సురేందర్‌రెడ్డి స్వీకరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నేరేడుచర్ల, మేళ్లచెర్వు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన ఉచిత విద్య లభిస్తుందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సోమయ్య అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో మన పిల్లల్ని మన ఊరి బడిలోనే చేర్పిద్దాం' అనే నినాదంతో ఏర్పాటు చేసిన జాతాను కాంప్లెక్స్ హెచ్ఎం బట్టు మధు, ఎల్‌శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం నేరేడుచర్లలో, మేళ్లచెర్వు మండలంలోని యతిరాజాపురం తండాలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకవీడు యూటీఎఫ్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.శ్రీనయ్య, అక్కయ్యబాబు, నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు సాంబయ్య, రవీందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేసి అందించాలి

సూర్యాపేటటౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని మునిసిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. 100రోజుల ప్రణాళికలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని కోమటికుంట ఎస్సీ కాలనీలో పారిశుధ్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వీధి కుక్కలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. పెంపుడు కుక్కలకు యజమానులు టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. వార్డుల్లో నీటి సరఫరాకు సంబంధించి క్లోరినేషన్ టెస్టులు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ సత్యారావు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ తిరుమలయ్య, యాదగిరి, టీఎంసీ శ్వేత, శివప్రసాద్, శివాజీ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లకు దరఖాస్తుల స్వీకరణ

మఠంపల్లి, మునగాల, మునగాల రూరల్, మేళ్లచెర్వు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో పలు సబ్జెక్టుల బోధనకు గెస్ట్ లెక్చరర్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయకుమారి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సీఈసీలో బోధించడానికి ఎంఏ తెలుగు, ఇంగ్లీషు, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, కామర్స్‌లలో ఉత్తీర్ణత సాధించినవారు, ఎంపీహెచ్‌డబ్ల్యూలో బోధించడానికి ఎంఎస్‌సీ నర్సింగ్/బీఎస్సీ నర్సింగ్‌లో పలక్ష పాటు అనుభవం ఉన్నవారు ఈ నెల 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

● మునగాలలోని కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో ఏ.వెంకటేశ్వర్లు, ఎస్‌వో సునీత మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తెలుగు, ఇంగ్లీషు, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ ఒక్కో పోస్టుకు ఎంఎస్సీ, బీఈడీ అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు ఈ నెల 7వ తేదీ వరకు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

● చింతలపాలెం మండల కేంద్రంలోని కేజీబీవీలో ఆరు గెస్ట్ లెక్చరర్ల కోసం ఎంఎస్సీ, బీఈడీ విద్యార్హత కలిగిన మహిళా అభ్యర్థుల దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేక అధికారి డి. ప్రసన్న, ఎంఈవో శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈనెల నాలుగో తేదీ నుంచి ఏడో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కేజీబీవీలో ఇంటర్ అడ్మిషన్లకు ఆహ్వానం

తుంగతుర్తి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి ఎం.జ్యోతి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు.

కల్తీ విత్తనాలు, ఎరువులను అరికట్టాలి

అర్వపల్లి, ఆత్మకూర్(ఎస్), నూతనకల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కల్తీ విత్తనాలు, ఎరువులను అరికట్టాలని అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శంకర్, గంట నాగయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం అర్వపల్లి, ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో, నూతనకల్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ- కల్తీ విత్తనాలు, ఎరువుల విక్రయించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతులకు ఉచితంగా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని, పంటల్ బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్వపల్లి తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అబ్బిరెడ్డి వెంకటరెడ్డి, ఎస్కే జలీల్, నర్సిరెడ్డి, దేగల వెంకటకృష్ణ, సట్టగొండ నాగయ్య, పల్లూరి సింహాద్రి, ముప్పారి సుదర్శన్‌రెడ్డి, మున్నా అశోక్, గద్దం శీను, పాపయ్య, మాడిమైల సోమయ్య లింగారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

హుజూర్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎన్‌ఎస్‌యూఐ బ్లాక్ అధ్యక్షులు అమర్‌నాథ్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచిన సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఇందిర సెంటర్‌లో ఐఎన్‌టీయూసీ ఇందిర ప్రియదర్శిని అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బిలకుత్తిని శాంత, శాంతారజ్యం, మీసాల నాగమణి, తిరపమ్మ, రాములమ్మ, సునీతకుమారి, సుధారాణి, సుజాత, అక్కమ్మ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలి

హుజూర్‌నగర్ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని మండల వైద్యాధికారి వేణుగోపాల్, ఆయుష్ డిపార్ట్‌మెంట్ యోగా శిక్షకులు బేతం రామాంజిరెడ్డి కోరారు. మంగళవారం లింగగిరి గ్రామంలో ఆశా కార్యకర్తలు, మండల వైద్యసిబ్బందికి యోగా, మెడిటేషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పద్మ, సూర్యప్రకాశ్, సావిత్రి, మాలతి, జ్యోతి, రమ, వెంకమ్మ, ఇందిరా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే.. వరదే(నా)?

(5వపేజీ తరువాయి)

వరకు 12 వరకు పాత భవనాలు ఉన్నాయి. ఇక్కడ ఏసిమెంట ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంటుంది. బీమారం రోడ్డు కృష్ణా థియేటర్ ప్రాంతంలో ఎనిమిది వరకు పాత నివాస భవనాలు ఉన్నాయి. బొడ్రాయి బజార్ సమీపంలో అనేక భవనాలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి.

వీధులు అధ్వానం

ఐదేళ్ల కిందట కొన్నివార్డుల్లో అండర్ డ్రైనేజీ కోసం రోడ్ల మధ్యలో తవ్వకాలు చేపట్టడంతో వీధులన్నీ గుంతలమయంగా మారాయి. మే నెలలో మునిసిపల్ ఆధ్వర్యంలో మురుగుకాల్వల్లో సిల్ట్ తీసేందుకు సిల్ట్ పనులు ప్రారంభించినా అవి ఎక్కడ జరుగుతున్నాయో, ఎంతవరకు వచ్చిందో ఎవరికీ తెలియని పరిస్థితి ఉంది.

యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం

ఈ నెల 2వ తేదీ నుంచి జిల్లా కేంద్రంలో 100రోజుల యాక్షన్‌ప్లాన్ అమలు చేస్తున్నాం. వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని ముంపు ప్రాంతాల్లో ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ఏ చిన్న సమస్య ఉన్నా ప్రజలు నేరుగా సమాచారం ఇవ్వొచ్చు. యాక్షన్‌ప్లాన్‌లో అన్ని సమస్యలు పరిష్కరిస్తాం.

- బి.శ్రీనివాస్, మునిసిపల్‌కమిషనర్, సూర్యాపేట

లోతట్టు జలమయం

తిరుమలగిరి: మోస్తరు భారీ వర్షం పడితే తిరుమలగిరి పరిధిలో ప్రధాన రహదారితో పాటు వివిధ కాలనీల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. కన్నెకుంగా సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, వర్షపు నీరు మళ్లించేందుకు మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రతీ ఏడాది వర్షాకాలంలో వరద ముంపుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా క్రాస్‌రోడ్ నాలుగు కూడళ్లలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక చిన్న వర్షానికే రోడ్లు జలమయమై రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. నాలాలను ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టడంతో రోడ్లపైకి వరద చేరుతోంది. గతేడాది సెప్టెంబరులో కురిసిన భారీ వర్షానికి సుమారు ఐదు పీట్ల ఎత్తులో వరద నీరు రోడ్డుపై నిలిచింది. ఆయితే వర్షాకాలంలో అప్పటికప్పుడు కంటితుడుపు చర్యలు చేపడుతున్నారు. గతానుభవాన్ని దృష్టిలో పెట్టుకుని క్రాస్‌రోడ్ పరిసరాలు, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టలేదు. వర్షాకాలం వచ్చిందంటే వరద ముంపుకు గురికావాల్సిందేనా అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

దద్దనాలచెరువు స్థలంలోనే ఇళ్ల నిర్మాణం

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో వరద ముప్పు నుంచి ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టకపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విష్ణేశ్వరకాలనీ, దద్దనాలచెరువు, ఎన్‌ఎస్‌పీ కాలనీతో పాటు శ్రీనగర్‌కాలనీ, లక్కవరం రోడ్డు, శివాలయం వీధి, సుందరయ్యనగర్ కాలనీ, గంగమ్మ దేవాలయం రోడ్డు తదితర ప్రాంతాల్లో గతేడాది సెప్టెంబరు 1న కురిసిన భారీ వర్షాలకు ఇళ్లల్లోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులుపడ్డారు. విష్ణేశ్వర కాలనీ మొత్తం దద్దనాలచెరువు స్థలంలోనే చేపట్టారు. సుమారు 300 కుటుంబాలు ఇళ్ల నిర్మాణం చేయగా, వర్షం వస్తే కాలనీ మొత్తం నీటిలో మునిగిపోతుంది. ఆ కాలనీ చుట్టూ సక్రమంగా రోడ్లు లేకపోవడం, డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారడంతో ప్రతి ఏటా వర్షాకాలంలో ముంపునకు గురవుతోంది. ఆదివిధంగా ఊరచెరువు పొంగి ప్రవహించడంతో సుందరయ్యనగర్ కాలనీ, శివాలయం వీధి, మసిదరాజ్ బజారు, గంగమ్మ దేవాలయం సెంటర్లలోని అనేక ఇళ్లల్లోకి వరద చేరింది. సుమారు 200 కుటుంబాలు నీట మునిగాయి. పట్టణ ప్రజారోగ్య సక్రమంగా లేకపోవడంతో వర్షాకాలంలో వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో ముంపు ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టకపోవడంతో వానొస్తే ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

గతేడాది అనుభవంతో ముందస్తు చర్యలు

కోదాడ: గత ఏడాది సెప్టెంబరులో కురిసిన భారీ వర్షానికి కోదాడ పట్టణం అతలాకుతలమైంది. భవానీనగర్‌లోని ఇళ్లలోకి వరదనీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ఆస్తినష్టంతో పాటు ప్రాణనష్టాన్ని చూడాల్సి వచ్చింది. అస్తవ్యస్త డ్రైనేజీలు, మెయిన్‌రోడ్డుపై సాంకేతిక లోపంతో చేపట్టిన డ్రైనేజీతో బాలాజీనగర్, కట్టకమ్ముగూడెం నీరు దిగువన ఉన్న భవానీనగర్‌ను ముంచెత్తింది. ఫలితంగా ఇళ్లల్లోకి మోకాల్లోతు నీరు చేరింది. ఈ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని మునిసిపల్ అధికారులు వర్షాకాలానికి ముందే డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టారు. రామిరెడ్డినగర్ నుంచి శ్రీరంగాపురం వరకు రహదారికి ఎడమ వైపు మట్టితో గింపు చేశారు. అంతేకాక పట్టణంలోని దిగువ ప్రాంతాల్లో డ్రైనేజీల మరమ్మతులు చేపట్టి వర్షపు నీరు ముందుకు పోయేలా చర్యలు తీసుకున్నారు.

ఇళ్లల్లోకి వరద రాకుండా చర్యలు తీసుకోవాలి

భారీ వర్షాల సమయంలో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అవుతున్నాయి. పట్టణంలోని అనేక ప్రాంతాల్లోని పలు కాలనీలను ముంపు బెడద వేధిస్తోంది. వర్షపు నీరు కాలనీలోకి రాకుండా చర్యలు తీసుకోవాలి. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి.

- దీకొండ లక్ష్మీనారాయణ, హుజూర్‌నగర్